క్లుప్తంగా

గిరిజన 'యాత్ర'ను జయప్రదం చేయాలి

వినుకొండ: పట్టణంలో ఈనెల 17న జరిగే గిరిజన ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ మెంబర్ వడితె శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులో బొల్లా కన్వెన్షన్ హాలులో ఎస్టీ నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఎస్టీల హక్కులు సాధించుకునేందుకు చైతన్య యాత్రలో భాగంగా వినుకొండలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వినుకొండలో జరిగే కార్యక్రమానికి భారీ సంఖ్యలో ఎస్టీలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత జీవితంలో ఉన్నతంగా ఎదగాలి

నాదెండ్ల: యువత క్రమశిక్షణ, అంకితభావంతో జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేయాలని ప్రిన్సిపల్ ఏబీపీ మనోహర్ చెప్పారు. గణపవరం సీఆర్ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ముందుగా విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని, దీంతో శారీరకంగా, ఆర్థికంగా ఇబ్బందులు తప్పుతాయన్నారు. హెచ్ఐవీ వంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, డైరెక్టర్ చుండి రంగనాయకులు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, ఇంటర్ విభాగం ఇన్‌చార్జి నిరంజన్, క్రిస్టియన్ అసోసియేషన్ ఫర్ మెడికల్ మిషన్ పీడీ కె.పవన్‌కళ్యాణ్, ఏఎస్ఎం ఊహా తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి అండగా ఉంటాం

నరసరావుపేట రూరల్: నిరంతరం ప్రజా రక్షణకై పాటుపడే పోలీస్ సిబ్బందికి అండగా ఉంటామని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్ తెలిపారు. మాచవరం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన కె.రమేష్‌బాబు కుటుంబ సభ్యులకు పోలీస్ అసోసియేషన్ నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంతోష్ మృతుడు రమేష్‌బాబు సతీమణి తేజస్వికి సాయం చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.



హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్ అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ సంతోష్

విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నరసరావుపేట ఈస్ట్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు డిమాండ్ చేసారు. ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అరండల్‌పేటలోని సిపిఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పతాకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయోద్యమ కాలంలో లక్నోలోని బెనారస్ విశ్వవిద్యాయంలో 1936 ఆగస్ట్ 12వ తేదిన ఆవిర్భవించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అవిరళ కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితిని నేటి పాలకులు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందివ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాల ల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతి రద్దు చేస్తూ ఇచ్చిన ఆదేశాలను వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలలోని సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు నాగేశ్వరరావు, మధు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

ఆయిల్‌ఫాంకు విస్తారంగా ప్రోత్సాహకాలు

నాదెండ్ల: ఆయిల్‌ఫాం సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని చిలకలూరిపేట ఉద్యానవన శాఖ అధికారి ఆర్ శ్రీలక్ష్మి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెక్టార్ భూమిలో ఆయిల్ పామ్ సాగుకు 150 మొక్కలను నూరుశాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. అంతర్‌సాగు ప్రోత్సాహకంలో భాగంగా హెక్టార్‌కు నాలుగేళ్ళపాటూ రూ.21 వేల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. బిందు సేద్యం ద్వారా ఆయిల్‌ఫాం సాగు చేయాలన్నారు. ఆయిల్ సాగు విస్తీర్ణం పెరిగేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడు హరిబాబు, నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న అధికారులు

ఆల్బెండాజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ

- కంటికి కనిపించని శత్రువు నులిపురుగులు
- పిల్లల్లో రక్తహీనత ఎక్కువగా అందుకే

యడ్లపాడు: కంటికి కనిపించని శత్రువు నులిపురుగులు అని నరేంద్ర సువర్ణ కుమారి చెప్పారు. మండలంలోని తిమ్మాపురం, దింతెనపాడు గ్రామాల్లో మండల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల వల్ల కలిగే నష్టాలు, వాటి నిర్మూలనకు చేయాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వై.ప్రసాదరావు, పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నూజెండ్ల: క్రమం తప్పకుండా నులిపురుగుల మాత్రలు తీసుకోవటం ద్వారా రక్తహీనత నియంత్రణలోకి వస్తుందని ప్రభుత్వ వైద్యాధికారి జె.దీపికా మంజూషా అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

శావల్యాపురం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలలు అంగన్‌వాడీ సెంటర్లలో 01 నుంచి 19 సంవత్సరాలలోపు చిన్నారుల అందరికీ అల్‌బెండజోల్ మందు బిళ్లలు మింగించే కార్యక్రమం నిర్వహించినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రావిపూడి రమ్య తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు మధ్యాహ్నం భోజన అనంతరం అల్‌బెండజోల్ మందు బిళ్లలు మింగించే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు ఏడుకొండలు ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్త శ్రీలలిత, అంగన్‌వాడీ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



యడ్లపాడు మండలంలో అవగాహన కల్పిస్తున్న నరేంద్ర సువర్ణ కుమారి

బొల్లాపల్లి: బొల్లాపల్లి, వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం మింగించారు.

రొంపిచర్ల : మండలంలోని రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలు చేపట్టారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల అన్ని మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో 1-19 సంవత్సరాల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి వారిచే మ్రింగించారు.

పశువులకు విద్యుదాఘాతం

శావల్యాపురం: సీతారామస్వామిదేవస్థానం ప్రతిష్టా సందర్భంగా గ్రామంలో స్వామివారిపేరుతో వదలిన ఆంబోతు,దూడ రెండూ విద్యుత్ షాక్‌కుగురై మృత్యువాతపడ్డాయి. మండలంలోని కారుమంచిగ్రామం దేవస్థానానికిచెందిన ఎద్దు దూడ గ్రామ సమీపంలోని పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు వద్ద విద్యుత్ తీగలు తగలటంతో రెండు అక్కడిక్కడే మృతిచెందాయి. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు, సంప్రదాయం ప్రకారం పూజలు చేసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఖననం చేశారు.

ఉన్నత పాఠశాలల పరిశీలన

బొల్లాపల్లి: సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు మండలంలోని రావులాపురం, రేమిడిచర్ల, జడ్పీ హైస్కూల్స్, ఏపీ మోడల్‌స్కూల్‌ను మంగళవారం సందర్శించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రులకు సంబంధించిన ఆథెంటికేషన్‌ను పరిశీలించారు. బడి బయట పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. రెగ్యులర్ స్కూల్స్ లో చేరని విద్యార్థులను ఓపెన్ స్కూల్లో చేర్పించాలన్నారు. పెండింగ్ త్వరగా పూర్తి చేయాలన్నారు. సెక్టోరియల్ అధికారులు ఏ పీ ఓ పద్మారావు, ఏఎస్ శంకర రాజు,ఏ ఎల్ సి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎం ఈ ఓ 2 కె పార్వతి తదితరులు ఉన్నారు

కంప్యూటర్ ప్రింటర్ కొనుగోలుకు ఆర్థికసాయం

వినుకొండ: పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో గల జడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్ ప్రింటర్ కొనుగోలు నిమిత్తం రూ.15వేలు విశ్రాంత ఉపాధ్యాయులు గాండ్లమూల నాగేంద్రుడు అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం సీహెచ్. వీరప్పయ్య తెలిపారు. కొత్తగా హైస్కూల్ ఏర్పడినందున పాఠశాలకు మౌలిక వసతులు ఆవశ్యకత ఉన్నాయని తెలపడంతో ఆర్థికసాయం చేసిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం దాత నాగేంద్రుడు మాట్లాడుతూ తన తల్లిదండ్రులు సుబ్బయ్య, చెంచమ్మల పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఎస్.పద్మజ, పాఠశాల పీడీ ఆర్. రాధాకృష్ణమూర్తి, గోవింద్‌నాయక్, రామాంజనేయులు, ఎలీషా పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

నరసరావుపేట ఈస్ట్: ఆధునిక గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఏ.ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఆంధ్ర చైతన్య గ్రూప్, శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ, గణిత శాస్త్రవేత్తగా పేరు పొందిన రంగనాథన్ లైబ్రరీ సైన్స్‌లో కొలోన్ క్లాసిఫికేషన్ సిస్టం ను రూపొందించి గ్రంథాలయల అభివృద్ధిలో కృషి చేసారని కొనియాడారు.

మద్యం దుకాణంలో వీరంగం

- మందుబాబుల మధ్య ఘర్షణ
- ఒకరికి తీవ్రగాయాలు

నాదెండ్ల: గణపవరం- వేలూరు డొంక రోడ్డులోని మద్యం దుకాణంలో సోమవారం రాత్రి మందుబాబులు వీరంగం చేశారు. ఒడిషాకు చెందిన ఉత్తమ్ రౌత్‌ను రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన ఇరువురు యువకులు బీర్ సీసాలతో దాడి చేసి గాయపరిచారు. మద్యం దుకాణంలో పూటుగా మద్యం సేవించిన యువకుల మధ్య మాటా మాటా పెరగడంతో ఘర్షణకు దారితీసింది. తీవ్ర గాయాలపాలైన ఉత్తమ్‌రౌత్‌ను 108 సాయంతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు మద్యం దుకాణం వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. క్షతగాత్రుడు ఉత్తమ్‌రౌత్ గడిచిన నాలుగేళ్లుగా స్థానిక స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్నాడు. వాస్తవంగా మద్యం దుకాణ యజమానులు మద్యం సీసాలు విక్రయించాల్సి ఉండగా, సిట్టింగ్ ఏర్పాటు చేయటంతో మందుబాబులు అక్కడే తాగుతున్నారు. దీంతో మందుబాబుల గొడవలు మితిమీరుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు ఘర్షణలు చోటు చేసుకుని ఎంతోమంది గాయాలపాలయ్యారని పేర్కొంటున్నారు.



గాయాలపాలైన ఒడిషా యువకుడు

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించండి

చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో ఎస్ఎంయూఏ ధర్నా

చిలకలూరిపేట టౌన్: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చిలకలూరిపేట డిపో వద్ద రెండు రోజుల ధర్నా కార్యక్రమం ప్రారంభమైంది. మంగళవారం డిపో వద్ద జరిగిన ధర్నాలో ఏఎంయూఏ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తమ ప్రధాన డిమాండ్లను తెలియజేశారు. ఐఆర్ (ఐఖ) వెంటనే ప్రకటించాలని, ఉద్యోగులకు తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీకి చెందిన స్థలాలను లీజుకు ఇవ్వడాన్ని వెంటనే ఆపివేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగులకు ఎంప్లాయ్ హెల్త్ స్కీం పూర్తిస్థాయిలో అమలు జరిగేలా చూడాలని కోరారు. అలాగే ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డియర్‌నెస్ అలవెన్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కండక్టర్లు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలతో పాటు గ్యారేజ్‌లో ఉన్న అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎస్ఎంయూఏ నాయకులు స్పష్టం చేశారు.



డిపో ఆవరణలో ఎస్ఎంయూఏ నాయకులు ధర్నా చేస్తున్న దృశ్యం

ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి

నరసరావుపేట రూరల్: ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ, నరసరావుపేట ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎం. వెంకటరమణ తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న డీఎస్పీ వెంకట రమణ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. ర్యాగింగ్ పేరుతో వేదింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ర్యాగింగ్ చిన్నదైన అందులోని సెక్షన్లు, శిక్షలు కఠినంగా ఉంటాయని తెలిపారు. కళాశాలలో ఎటువంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని విద్యార్థులకు అవగాహన కల్పించాలని యాంటి ర్యాగింగ్ కమిటీకి సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పి.రామకృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కేపి సుబాషిణి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

డ్రగ్స్,ర్యాగింగ్ దుష్ప్రభావాలపై అవగాహన

వినుకొండ: జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, వినుకొండ సీఐ శోభన్ బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని రాధా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు సమీర్ భాష, సత్యనారాయణలు పాల్గొని విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. డ్రగ్స్ కు బానిసలైతే భవిష్యత్తు ఎలా నాశనమవుతుందో, కుటుంబాలు ఎలా చిన్నాభిన్నం అవుతాయో తెలిపారు. అలాగే ర్యాగింగ్ అనేది చట్టరీత్యా నేరమని, దీనివల్ల విద్యార్థుల మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని చెప్పారు. ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విద్యార్థులు తమ చదువుపై దృష్టి సారించి, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లోరాధా డిగ్రీ కళాశాల యాజమాన్యం , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సమీర్ భాష

కొలిక్కిరాని ఐసీఐసీఐ బ్యాంక్ కుంభకోణం కేసు

- చిలకలూరిపేట బ్రాంచి వద్ద బాధితుల గోడు
- తమకు ఇంకా న్యాయం జరగలేదని పలువురి ఆవేదన
- ఆత్మహత్యే శరణ్యం అంటూ వాపోయిన దంపతులు



మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు సుంకర రమాసుధ



మీడియాతో మాట్లాడుతున్న షేక్ కరిమూన్, సుభాని దంపతులు

చిలకలూరిపేట: ఐసీఐసీఐ బ్యాంక్ కుంభకోణంలో చిక్కుముడులు ఇంకా వీడలేదు. గత ఏడాది అక్టోబర్‌లో చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకు బ్రాంచిలో రూ.కోట్ల కుంభకోణం జరిగింది. ఉన్నతాధికారులు విచారణ నిర్వహించటంతోపాటు కేసును సీఐడీకి అప్పగించటంతో వివాదం కొంతమేరకు సర్దుమణిగింది. తాజాగా మంగళవారం ఇరువురు బాధితులు బ్యాంకు వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. కొంతమందికి ఇంకా న్యాయం జరగలేదన్న విషయం దీంతో నిర్ధారణ అయింది. పట్టణానికి చెందిన షేక్ కరిమున్, సుభాని దంపతులు మాట్లాడుతూ... తాము 2021 జూన్ 30వ తేదీన 76.80 గ్రాముల బంగారం తాకట్టు పెట్టి రూ.1.90 లక్షల రుణం తీసుకున్నామన్నారు. బ్యాంకుకు సిబ్బందిని అడిగితే ఖాతా ఎప్పుడో మూసి వేశామని చెప్పారన్నారు. లెడ్జర్ తెప్పించి పరిశీలిస్తే సంతకం వేరేవారిది ఉందని వివరించారు. కోర్టులో లేదా, సీఐడీ వద్ద తేల్చుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. న్యాయం చేయకపోతే ఇద్దరం బ్యాంకు ముందు ఆత్మహత్యకు పాల్పడతామని హెచ్చరించారు.

లాకరే లేదంట...

మరో బాధితురాలు సుంకర రమాసుధ మాట్లాడుతూ తాను 2023 జూన్ 16వ తేదీన లాకర్‌లో పెట్టాలని 800 గ్రాముల బంగారం ఇచ్చానని తెలిపారు. బంగారం ఫొటోలు తీసి ఇచ్చారన్నారు. తెల్ల కాగితాలపై వివరాలు రాసి ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు అడిగితే అసలు లాకర్ సిస్టమే లేదంటున్నారని వాపోయారు. సీసీ పుటేజీలు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. 2017 నుంచి దూడ నరేష్ చంద్రశేఖర్ బ్రాంచి మేనేజర్‌గా వ్యవహరించిన కాలంలో ఫిక్సెడ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, గోల్డ్ లోన్స్‌కు సంబంధించి భారీ కుంభకోణం ఈ శాఖలో జరిగింది. అతను ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లాక గత ఏడాది అక్టోబర్‌లో ఈ కుంభకోణం బయటపడింది. పలువురు బ్యాంకు సిబ్బందితో పాటు చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సింగ్ అజిత్‌కుమార్, ఆయన తల్లి బ్యాంకు ఖాతాల్లోకి రూ. 35 కోట్లు బదిలీ అయినట్లు గుర్తించి ఈ ఏడాది మార్చి నెలలో అతనిని సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. బ్యాంకు మేనేజర్ శివశంకర్‌ను వివరణ కోరగా విషయం సీఐడీ, కోర్టు పరిధిలో ఉన్నందున ఏమీ మాట్లాడలేనని తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.